క్లుప్తంగా

కష్టపడే వారికి తగిన గుర్తింపు



పట్నంబజారు: కష్టపడి పనిచేసే వారిని గుర్తించి, పార్టీలో వారికి సముచిత స్థానం కల్పించడంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ ముందుంటారని కార్పొరేటర్లు పాపతోటి అంబేడ్కర్, ధూపాటి వంశీ కొనియాడారు. అందుకు మస్తాన్‌వలి నియామకమే తాజా నిదర్శనమని వారు తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన షేక్ మస్తాన్ వలిని సోమవారం సంజీవయ్య నగర్‌లోని కార్యాలయంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పదవులతో పని లేకుండా పార్టీలో నిజాయతీగా పని చేసే షేక్ మస్తాన్ వలి నియామకంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, ఆలా కిరణ్ తదితరులు పాల్గొని షేక్ మస్తాన్ వలికి శుభాకాంక్షలు తెలిపారు.

ఫిజియోథెరపి కోర్సులకు ఉజ్వల భవిష్యత్



గుంటూరు మెడికల్: ఫిజియోథెరపి విద్యకు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఫిజియోథెరపి విభాగాధిపతి జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ కాలనీ హారిక కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి 'ఫ్రెషర్స్ డే' సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫిజియోథెరపి రంగంలో ఎప్పటికప్పుడు అధునాతన, సాంకేతిక యంత్రాలు, పనిముట్లు, వాటిని వివరించి చెప్పే విద్య అభివృద్ధి చెందుతున్నట్లు వెల్లడించారు. జబ్బుల నుంచి కోలుకున్న రోగులకు పూర్తి స్వాంతన చేకూర్చటంలో ఫిజియోథెరపి ముఖ్య పాత్ర పోషిస్తోందని వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో, శ్రద్ధతో, కొత్త విషయాలు తెలుసుకునేందుకు చొరవ, ఆసక్తి చూపాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల డైరెక్టర్ డాక్టర్ సుభాని షేక్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా పారా మెడికల్, డిప్లొమో కోర్సులు నిర్వహిస్తున్నామని, గత ఆరు సంవత్సరాలుగా ఫిజియోథెరపి కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫలితాలు సాధిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మహినా షేక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.హరికృష్ణ, ప్రొఫెసర్ శామ్యూల్ సతీష్, ప్రొఫెసర్ కోటేశ్వరరావు, డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ మృదుల, డాక్టర్ దయాకర్, డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రమాణస్వీకారం



తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఐడీసీ) చైర్మన్‌గా దేగల ప్రభాకరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాకు ఈ బాధ్యత అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. పరిశ్రమల ద్వారానే నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుందని, ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా ప్రభాకరరావుకు టీడీపీ జిల్లా అధ్యక్షులు, తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, ఏపీఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ వి.రఘునాథ్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ సిబ్బంది ఎం.రామకృష్ణ, వైఎస్ఎస్ సురేష్, సిహెచ్.దుర్గ ప్రసాద్, వై.కృష్ణ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు వినియోగిస్తే కఠిన చర్యలు

గుంటూరు ఎడ్యుకేషన్: మాదక ద్రవ్యాలను వినియోగించడంతో పాటు కలిగి ఉండటం, అక్రమంగా రవాణా చేయడం శిక్షార్హమైన నేరాలుగా పరిగణలోకి తీసుకుంటారని కొత్తపేట ఎస్ఐ రమేష్ పేర్కొన్నారు. సోమవారం సాంబశివపేటలోని ఏసీ కళాశాలలో యువజన సర్వీసుల శాఖ, స్టెప్-స్వశక్తి ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, మాదక ద్రవ్యాలు, ఈవ్ టీజింగ్, అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు, యువతరం మాదక ద్రవ్యాల జోలికి వెళ్లి, జీవితాని నాశనం చేసుకోరాదని హితవు పలికారు. బాధితులు 1930కు ఫోన్ ద్వారా సమాచారాన్ని ఇస్తే పోలీసుశాఖ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్, మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ డి.రవిచంద్ర, సైకాలజిస్ట్ శ్రీధర్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో స్టెప్ స్వశక్తి మేనేజర్ బి.రాధిక, యువజన సర్వీసులశాఖ సూపరింటెండెంట్ టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పొన్నూరు రోడ్డులో ఫుట్‌పాత్‌కు అడ్డగా పరదాలు కట్టేసి..



హిందూ కళాశాల నుంచి ఏసీ కళాశాలకు వెళ్లే రోడ్డులో..



ప్రభుత్వ మహిళా కళాశాల రోడ్డులో..

'నడక'యాతన

ఫుట్‌పాత్‌లు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. పాదచారులకు సౌకర్యం కోసం నగరంలోని ప్రధాన రహదారులకు ప్రత్యేక ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశారు. లక్షలాది రూపాయలతో ఆధునికీకరించారు. ట్రాఫిక్ రద్దీ నుంచి పాదచారులు గమ్యస్థానాలకు చేరుకునేందుకు అవకాశం కోసం నిర్మించారు. ఫుట్‌పాత్‌ల నిర్వహణ అధ్వానంగా మారింది. దీంతో వీటిపై చిరువ్యాపారులు పాగా వేస్తున్నారు. కొన్ని చోట్ల వ్యాపారులు పార్కింగ్ స్థలాలుగా వినియోగించుకుంటూ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. పాదచారులు నరక యాతన పడుతున్నారు. పొన్నూరు రోడ్డు నుంచి బుడంపాడు బైపాస్ వరకు, నగరంపాలెంలో ఇరువైపులా, హిందూ కళాశాల నుంచి ఏసీ కళాశాలకు వెళ్లే రోడ్డులోని ఫుట్‌పాత్‌పై కూడా చిరు వ్యాపారులు వెలిశారు. ప్రభుత్వ మహిళా కళాశాల ఎదురు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లు అక్రమించేశారు.

–నగరంపాలెం



నగరపాలెం మూడు బొమ్మల వద్ద ఫుట్‌పాత్.



ఫుట్‌పాత్‌పై ద్విచక్ర వాహనాలు..

పోలీసుల సమక్షంలో పారిపోయి వచ్చిన పిల్లలు



బీచ్‌రోడ్డు(విశాఖజిల్లా): ఆర్కేబీచ్ బస్‌స్టాప్ ఎదురుగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు బాలురను మూడో పట్టణ పోలీసులు చేరదీశారు. వివరాలు.. గుంటూరు జిల్లాకు చెందిన ఎస్కే హసిం, అబ్దుల్ రూత్‌లు ఓ ప్రైవేటు స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నారు. ఈ ఇద్దరు పిల్లలు ఇంట్లో చెప్పకుండా విశాఖ చేరుకున్నారు. బీచ్‌లో అనుమానాస్పదంగా తిరగడంతో ఏఎస్సై శ్రీనివాసరావు వారి వద్దకు వెళ్లి వివరాలు ఆరా తీశారు. వారి చెప్పిన వివరాల ప్రకారం గుంటూరు పట్టాభిపురం పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు. అనంతరం వారిని మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

అర్జీల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యం

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: కార్పొరేషన్ పరిధిలో ప్రజల నుంచి అందిన అర్జీల సత్వర పరిష్కారానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ అందులో భాగంగా కాల్ సెంటర్ 0863–2345103, 104, 105 నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 20 ఫిర్యాదులు అందాయని... వచ్చిన ఫిర్యాదులలో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేర్వేరుగా లిస్టు తయారు చేయాలని సిబ్బందిని కోరారు. డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజల నుంచి 41 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 16, ఇంజినీరింగ్ విభాగానికి 16, రెవెన్యూ విభాగానికి 5, పరిపాలన విభాగానికి 4 చొప్పున ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలి

నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను నేరుగా పరిశీలించిన తర్వాతనే బిల్లుల చెల్లింపునకు ప్రాసెస్ చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ సంగడిగుంట, శారదా కాలనీల్లో సీసీ రోడ్ల ప్యాచ్ వర్కులు, నూతన డ్రెయిన్లను ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. శారదా కాలనీలో పెండింగ్‌లో ఉన్న రోడ్ నిర్మాణ పనులను గమనించి, సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు వెంటనే ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం చౌడవరంలోని సీఆర్ కాలనీని పరిశీలించి, శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం తీసుకోవాలని అధికారులకు సూచించారు. పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, ఏసీపీ వెంకటేశ్వర్లు, డీఈఈ కళ్యాణరావు, ఆర్ఓలు రవి కిరణ్ రెడ్డి, సాదిక్ భాష, ఏఎంహెచ్ఓ రాంబాబు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కమిషనర్

స్వచ్ఛ గుంటూరు సాధనలో..

స్వచ్ఛ గుంటూరు సాధనలో యువత పాత్ర కీలకమని కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు గుంటూరు నగరపాలక సంస్థ చేపట్టిన సైక్లింగ్, 2కే వాక్, స్వచ్ఛత హీ సేవ ప్రతిజ్ఞ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలను సోమవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో అందించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా గుంటూరు నగరంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో భాగస్వామ్యమయ్యారని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి సుధీర్ పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు అండగా ఉంటాం

కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగరపాలక సంస్థ అండగా ఉంటుందని నగర నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల మరణించిన ఇంజినీరింగ్ విభాగం ఔట్ సోర్సింగ్ కార్మికుడు షేక్ ఉమర్ కుటుంబ సభ్యులకు ఎక్స్ గ్రేషియా చెక్కును సోమవారం కమిషనర్ చాంబర్‌లో అందించారు. ఇంజినీరింగ్ విభాగం ఎల్ఎల్ఆర్‌లో ఆప్కాస్ విధానంలో విధులు నిర్వహించే షేక్ ఉమర్ మృతి చెందారని, వారి కుటుంబ సభ్యులు షేక్ ముంతాజ్ బేగంకు ఎక్స్ గ్రేషియా రూ.2 లక్షలు, మట్టి ఖర్చులు రూ.15 వేల చెక్‌లను అందించామన్నారు.

కార్తిక సందడి



అరండల్‌పేట శివాలయంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కొత్తపేట శివాలయంలో కార్తిక దీపాలు వెలుగిస్తున్న భక్తులు



పాత గుంటూరు శివాలయంలో క్యూలైనులో భక్తులు -సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

నగరంలో ఆక్రమణల తొలగింపులో వివక్ష

- కార్పొరేటర్లకు ఇవ్వాల్సిన కనీస గౌరవం ఇవ్వడం లేదు
- కమిషనర్‌కు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల ఫిర్యాదు

నెహ్రూనగర్: నగరంలో ఆక్రమణల తొలగింపులో వివక్ష చూపుతున్నారని కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులుకు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు సోమవారం ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అధికారులు ఇవ్వాల్సిన కనీస గౌరవం ఇవ్వడం లేదని, ప్రొటోకాల్ పాటించడం లేదని... టీడీపీ, జనసేన నాయకులకు ఇచ్చిన గౌరవం కార్పొరేటర్లకు ఇవ్వడం లేదని నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో కమిషనర్‌ను కలసి విన్నవించారు. ప్రజల నుంచి ఎన్నుకోబడిన తామని కాదని టీడీపీ, జనసేన నాయకులను పిలుస్తున్నారని.. కనీసం మా మాట కూడా తీసుకోవడం లేదని ఆరోపించారు. నగరంలో రోడ్లు, డ్రెయిన్ల మీద ఆక్రమణల పేరుతో నగరపాలక సంస్థ అధికారులు చిరు వ్యాపారుల దుకాణాలను తొలగిస్తున్నారని.. దానికి మేము అడ్డుకాదని కొన్ని ప్రాంతాల్లో తొలగించి.. మరి కొన్ని ప్రాంతాల్లో తొలగించకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. నల్లపాడు రోడ్డు, అమరావతి రోడ్డులో చిరు వ్యాపారులను తొలగించారే తప్ప... డ్రెయిన్లను ఆక్రమించుకుని ఉన్న కొన్ని బడా వ్యాపారస్తుల జోలికి కార్పొరేషన్ సిబ్బంది పోవడం లేదని పేర్కొన్నారు.

విజిలెన్స్ ఎంక్వయిరీ వేయాలి..

హోర్డింగ్స్ నిర్వహణపై విజిలెన్స్ ఎంక్వయిరీ వేయాలని, కౌన్సిల్ నిర్వహించి మూడు నెలల కాలం అయిందని... కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని, దీంతో పాటుగా స్టాండింగ్ కమిటీ జరగలేదని... స్టాండింగ్ కమిటీ ఎన్నిక జరిపించాలని కమిషనర్‌ను కోరారు. అదే విధంగా అభివృద్ధి పనులు చేపట్టాలంటే ఎమ్మెల్యేలను కలవాలని అధికారులు, కాంట్రాక్టర్లకు చెబుతున్నారని... ఇది మంచి పద్ధతి కాదని... ఈ పనులన్నీ వైఎస్సార్ సీపీ హయాంలో మంజూరైన పనులే అని... వాటిన్నంటికి టెండర్లు పూర్తయ్యాయని.. ఇప్పుడు కొత్తగా ఎమ్మెల్యేలను కలవాలని చెప్పడం ఎంత వరకు కరెక్టు అని ప్రశ్నించారు. కార్పొరేటర్లు చెప్పిన పలు అంశాలను పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపుతామని... ప్రొటోకాల్ సమస్య ఎక్కడైన ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కమిషనర్ సూచించారు. కమిషనర్‌ను కలసిన వారిలో కార్పొరేటర్లు బూసి రాజలత, మల్లవరపు రమ్య, షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), దూపాటి వంశీ, మొహమూద్, కోఆప్షన్ సభ్యులు పూనూరి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు అగ్గిపెట్టే రాజు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు

వినికిడి యంత్రాలు పంపిణీ



గుంటూరు మెడికల్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గుంటూరు జీజీహెచ్‌లోని శుశ్రుత హాలులో సోమవారం విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జండర్, వయో వృద్ధుల సంక్షేమ శాఖ గుంటూరు జిల్లా సహాయ సంచాలకుల ఆధ్వర్యంలో ఉచితంగా స్పీచ్ అండ్ హియరింగ్ పరీక్షలు చేశారు. ఉచిత వైద్య శిబిరంలో 250 మంది హాజరై చికిత్స చేయించుకున్నారు. వీరిలో వినికిడి సమస్య నివారించేందుకు అవసరమైన 58 మందికి వినికిడి పరికరాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జండర్స్, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు సి.హెచ్.సువార్త, ఆడియాలజిస్ట్ శిరీష, అలీయావర్ జంగ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ డిజేబిలిటి రీజనల్ సెంటర్ సిబ్బంది, సీనియర్ సిటిజన్స్ సభ్యుడు పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఐదు దశాబ్దాల తర్వాత అ'పూర్వ' కలయిక

పులిపాక ప్రభుత్వ హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: సామాజిక మాధ్యమాలతో పుకార్లు షికార్లు చేయడమే కాకుండా మంచి పనులు సైతం జరుగుతున్నాయి. ఎప్పుడో 50 ఏళ్ల కిందట కలిసి చదువుకున్న విద్యార్థులను ఒక వేదికపై చేర్చడంలో సోషల్ మీడియా కీలకపాత్ర పోషించింది. పదో తరగతి పూర్తి చేసిన తరువాత ఎక్కడెక్కడ ఉన్నారో తెలియదు. వివిధ ప్రాంతాల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలు జరుగుతున్న నేపథ్యంలో తాము కూడా ఎలాగైనా సహచరును కలుసుకోవాలని నిశ్చయించుకున్నారు. తమ బ్యాచ్ విద్యార్థులు ఎక్కడెక్కడున్నారో సోషల్ మీడియా ద్వారా తెలుసుకోగలిగారు. 40 మంది పూర్వ విద్యార్థులందరినీ కలుపుకుని ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పాత గుంటూరులోని శ్రీపులిపాక కమలా హనుమంతరాయ హైస్కూల్ 1975–76 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం గుంటూరు నగరంలోని ఓ హోటల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. టెన్త్ వరకు కలిసి చదువుకుని, భావి జీవితం దిశగా అడుగులు వేస్తూ తలోదిక్కుకు వెళ్లిన సహచరులు 50 ఏళ్ల అనంతరం చిన్నతనంలో తమ పక్కనే కూర్చుని ఆటపాటలు, అల్లరి చేస్తూ గడిపిన సహచరులను చూసుకుని మురిసిపోయారు. ఎంతో ఉత్సాహంగా ఉన్న వారందరికీ ప్రస్తుతం 65 ఏళ్లు నిండాయి.ఉన్నత చదువులు పూర్తయిన తరువాత ఉద్యోగ, వ్యాపారాల్లో ప్రవేశించి కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందిన వారు సమావేశానికి తరలివచ్చారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఈ సందర్భంగా తమ బ్యాచ్ పేరుతో సామాజిక సేవకు నాంది పలికి, సేవా సంస్థలకు చేయూతనిచ్చేందుకు ఒక ట్రస్ట్ ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. కనీసం రెండేళ్లకోసారైనా ఇలా అందరూ కలుసుకుంటే వ్యాధులనేవి దరిచేరవని పూర్వ విద్యార్థి, సెంట్రల్ ఎక్సైజ్ రిటైర్డ్ సూపరింటెండెంట్ పి.కోటేశ్వరరావు చెప్పారు. కార్యక్రమాన్ని నంబూరు సుబ్బారావు, పి. కోటేశ్వరరావు, లంకా సత్యం నిర్వహించారు. కార్యక్రమంలో రామసీత, కృష్ణవేణి, కృష్ణకుమారి, ఇందుమతి, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, నరేంద్ర పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీల పిలుపు

లక్ష్మీపురం: సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీల పెంపును ప్రజలు వ్యతిరేకించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును తిప్పికొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని జిల్లా సీపీఎం కార్యాలయంలో సోమవారం సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ, ప్రజాపోరు తదితర పార్టీలు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే రూ.17,898 కోట్ల రుణాలు, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపేందుకు తెరలేపిందని తెలిపారు. 2022–23, 2023–24 సంవత్సరాలలో వాడుకున్న కరెంటుకు ఇప్పుడు సర్దుబాటు చార్జీల పేరుతో భారాలు మోపడం అన్యాయమని ఖండించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ విద్యుత్ కొనగోళ్లు, అమ్మకాలలో తేడాలు వస్తే ఆ సమస్యను పరిష్కరించాల్సింది ఆయా ప్రభుత్వాలు తప్పా, ప్రజలపై భారాలు మోపడం ఏమిటని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ ఉత్పత్తి పంపిణీని కేంద్రం పరిధిలోకి తీసుకుని రాష్ట్రాల హక్కులను హరించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సవరణ బిల్లులు తెచ్చి ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు ఉత్పత్తి చేసే హక్కులు కల్పిస్తోందని తెలిపారు. మరోవైపు అదాని కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు ప్రీపెయిడ్ మీటర్లను బిగిస్తున్నారని పేర్కొన్నారు. సీపీఐ(ఎంఎల్) నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వి.నరసింహరావు, ప్రజాపోరు నాయకులు కోటేశ్వరరావు మాట్లాడుతూ అదాని కంపెనీతో కుదుర్చుకున్న వ్యాపార ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకులు, పెట్రోలు, డీజిల్ వంట గ్యాస్ ధరలు పెరిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరో వైపు విద్యుత్ భారాలు మోపడం అన్యాయమని ఖండించారు. ప్రజలు దీన్ని ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్

అందరికీ అందుబాటులో యోగా కేంద్రాలు

తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్



గుంటూరు వెస్ట్: ప్రతి వ్యక్తికి నిత్య జీవితంలో యోగ సాధన ఎంతో మేలు అని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ తెలిపారు. సోమవారం స్థానిక అరండల్‌పేటలో స్వామి వివేకానంద యోగ కేంద్రాన్ని ఆయన యోగ గురువు ఆళ్ళ రాజేశ్వరరావుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయాలన్నారు. ఇప్పటికే పట్టణంలో యోగ సాధకుల సంఖ్య పెరిగిందన్నారు. ప్రజలకు యోగాను మరింత చేరువ చేసే ఉద్దేశంలో ప్రభుత్వం తరపున వచ్చే ఏడాది మే లోగా మూడు యోగ కేంద్రాలను అందుబాటులోకి తెస్తామన్నారు. యోగ గురువు ఆళ్ల రాజేశ్వరరావు మాట్లాడుతూ శిక్షణలో అనేక ప్రత్యేకతలతో పాటు ఆధునిక పద్ధతులను జోడిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అపెక్స్ ఇంగ్లిష్ ఇనిస్టూట్యూట్ అధినేత కె.నాగేశ్వరరావు, పులివర్తి శ్రీనివాసరావు, బైసు మల్లికార్జునరావు, దేవి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్లు మీద ఆవులను వదిలిపెడితే జరిమానా

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లపై సంచరించే ఆవులు, ఎద్దులు, గేదెలను రోడ్లమీదకు వదిలితే వాటిని నగరపాలక సంస్థ ప్రజారోగ్య సిబ్బంది బంధించి గోశాలకు తరలిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వెంగళాయపాలెంలోని జీఎంసీ గోశాలకు తరలించడం జరుగుతుందన్నారు. పశువులను యజమానులకు ఇచ్చేందుకు జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు.